# ఫేనీకే

కనానులోని కొంత ప్రదేశాన్ని ఫేనీకే అనే పేరుతో పిలిచినవారిలో బహుశా ప్రాచీన గ్రీకులు అద్యులు కావచ్చు. మధ్యధరాసముద్ర తీరంలో వున్న ప్రాంతాన్ని కవాను అని పేర్కొనడం సుమారు క్రీ.పూ. 1300లో ప్రారంభమైంది. ఈ ప్రాంతాన్నే తర్వాతి కాలంలో ఇశ్రాయేలు అనీ సిరియా అని పిలిచారు. తూర్పున లెబానోను పర్వతాలు పశ్చిమాన మధ్యధరాసముద్రం సరిహద్దులుగా వున్న యిరుకైన భూభాగమే పేనీకే. ఈ ప్రాంతం ఖరీదైన ధూమ్రవర్ణపు అద్దకపు పొడికి (ఊదా రంగు) ప్రసిద్ధి గనుక గ్రీకులు ఈ ప్రాంతాన్ని ఫేనీకే అని పిలిచారు. గ్రీకు భాషలో ఫేనీకే అంటే ధూమ్ర వర్ణం అని అర్థం. ఫేనీకే ప్రాంతం సార్వభౌమాధికారం వున్న రాజ్యం కాదు. ఈ ప్రాంతాల్లో స్వతంత్ర ప్రతిపత్తి గల అనేక పట్టణాలున్నాయి. వీటిల్లో తీరప్రాంతాలైన తూరు సీదోను గెబాలు ఆర్వాను పట్టణాలు కూడ వున్నాయి. ప్రతి పట్టణానికి స్వతంత్రుడైన రాజు వుండేవాడు. ఈ పట్టణాలన్నింటికీ యితర దేశాలతో వాణిజ్య సంబంధాలుండేవి.

పర్వతాలకు సముద్రానికి మధ్య వున్న భూభాగం సారవంతమైన ప్రదేశం గనుక ఎప్పుడూ యిది సస్యశ్యామలంగా వుండేది. మిగిలిన భూభాగమంతా ఎత్తైన పర్వతాలున్నాయి. ఈ పర్వతాలు దేవదారు వృక్షాలకు సరళవృక్షాలకు ప్రసిద్ధి. దేవదారుమ్రానులను సరళ మ్రానులను ఇశ్రాయేలు ఈజిప్టుతో సహా అనేకదేశాలకు ఎగుమతి చేసేవారు. అవసరమయ్యే దేవదారుకలప కొరకు సొలొమోను రాజు దేవాలయాన్ని రాజప్రాసాదాన్ని నిర్మించడం కొరకు తూరు రాజైన హీరాముతో ఒప్పందం కుదుర్చుకున్నాడు (1రాజులు 5-7). తుదకు, లెబానోను అడవుల్లో చాలా భాగం అంతరించిపోయింది.

ఫేనీకేలో తూర్పునవున్న ప్రాంతం మిట్టపల్లాలతో నిండిన ప్రాంతం గనుక ప్రజల జీవనోపాధి కొరకు మధ్యధరాసముద్రం మీద ఆధారపడేవారు. ధూమ్రవర్ణపు అద్దకపు చూర్ణాన్ని తయారు చేయడం ఫేనీకేలో ప్రధానమైన పరిశ్రమ. మధ్యదరాసముద్రతీరంలో దొరికే నత్తగుల్లలను అర్జించే లాభాలముందు నత్తగుల్లల దుర్గంధం వుపేక్షించదగిందే. ఫేనీకే ప్రాంతవాసులు నౌకానిర్మాణానికి కూడ ప్రసిద్ధి. వీరు నిర్మించిన ఓడలు మధ్యధరాప్రాంతమంతటా సరకులను రవాణా చేసేవి. నౌకానిర్మాణం నౌకాయానం వీరికి అపారమైన ధనాన్ని అర్జించిపెట్టేవి. రాత్రివేళల్లో నక్షత్రాల ఆధారంగా ఓడలను నడిపినవారిలో బహుశా ఫేనీకే నావికులే అద్యులు కావచ్చు. సుమారు క్రీ.పూ. 800 నుంచి, యెహెజ్కేలు కాలంలో (క్రీ.పూ.597-573) తూరు సీదోను పట్టణాలు సముద్రయానానికి పేరుపొందాయని ఇశ్రాయేలు ప్రవక్తల్లో

అనేకులు ప్రస్తావించారు (యెషయా 23:1-18: యెహెజ్కేలు 27: యోవేలు 3:4-8: ఆమోసు 1:9,10).

ఫేనీకే ప్రాంతవాసులు తమ నౌకాయాన సామర్థ్యం మూలంగా సుదూరప్రాంతాలకు (ఉత్తర ఆఫ్రికా, కుప్ర.మధ్యధరా సముద్రంలోని దీవులు. స్పెయిను) సైతం వలస వెళ్ళగలిగారు. తూరునుంచి వలస వెళ్ళినవారు కార్తేజ్ అనే స్వతంత్ర ప్రతిపత్తి గలిగిన నగరాన్ని కూడ స్థాపించారు నౌకానిర్మాణకులుగా ఫేనీకేవారి శక్తిసామర్థ్యాలు నావికులుగా వారి అనుభవం వారికి అనేకమంది శత్రువులను కూడగట్టాయి. ఈజిప్టు అష్షూరు బబులోను దేశాలు ఒక్కొక్కటీ వీరిపై దాడిచేసి ఫేనీకే ప్రాంతంపై తమ ఆధిపత్యాన్ని నిలుపుకోసాగాయి. చాలా శతాబ్దాలపాటు యిలాంటి కార్యకలాపాలు కొనసాగాయి. పారసీకులు ఫేనీకే ఓడల నుపయోగించుకొని ఈజిప్టుపై గ్రీసుపై దండెత్తారు. అయితే, తుదకు గ్రీకులు పారసీకులను ఓడించి (క్రీ.పూ.333). తూరు పట్టణాన్ని నాశనం చేశారు. ఫేనీకే ప్రాంతంలో గ్రీకు సంస్కృతి సాంప్రదాయాలు వ్యాపిస్తున్న కొలది ఫేనీకేవారి గత వైభవం ప్రాబల్యం నామ రూపాలేకుండా పోయాయి.

ప్రారంభంలో ఫేనీకే ప్రజలు సెమిటిక్ ప్రజల మతాచారాలనే అనుసరించేవారు. కనాను దేవుళ్ళను దేవతనే (ఏల్, బయలు, అషేరా) ఫేనీకే ప్రజలు కూడ పూజించేవారు. సస్య వృద్ధికి సంతాన సాఫల్యతకు కారణమైన దేవత అని ప్రజలు భావించే అదోనీస్ దేవతతో బాటు ప్రజలు అష్తారోతు దేవతను కూడ పూజించేవారు. అదోనీస్ దేవత ప్రతి సంవత్సరం గ్రీష్మ ఋతువులో మరణించి పాతాళానికి వెళ్ళిపోతుందని. అష్తారోతు దేవత పాతాళానికి వెళ్ళి నాట్లు వేసే కాలంలో అదోనీస్ దేవతను బ్రతికించి తీసుకువస్తుందని వీరి నమ్మకం. నరబలి యిచ్చే అలవాటు కూడ ఫేనీకే ప్రజల్లో వున్నట్లు ప్రాచీన రచనల్లో కొన్ని చారిత్రక ఆధారాలు కన్పిస్తున్నాయి.